



సంపుటము ౬    రాజమహేంద్రవరము    ౧౧ జూన్ ౧౯౩౭    ౬-వ సంచిక

# అరికాళ్లకింద మంటలు పెడితే........!

సుబ్రహ్మణ్యశాస్త్రి—సంపాదకుడు

"దిమ్మచెక్కలాగ అలా కూచోకపోతే కాస్త గంధం తియ్యరాదుటే ? రోజూ రోజూ చెప్పాలా ?"

"పెద్దబావ నిన్ననే వెళ్లిపోయారు కదా, యింక వారు పూసుకుంటారూ ?"

"మీ అమ్మా మీ నాన్నా—నోటితో చెప్ప రేటి ?"

"లేకపోతే యెలా తెలుస్తుందీ ?"

"ఆ మాత్రం వూహించుకోవద్దూ ? ముసలాళ్లూ, ముక్కాళ్లూ, వాళ్ళకేం గంధం పూసుకోడం ?"

"......................"

"ఈ జన్మలో నీ కెలాగా యోగం లేదు. ముందు జన్మలో నేనా సుఖపడా లంటే యిప్పు డిలాగ ముత్తయిదువులికి గంధం తీసి యివ్వడమూ, మల్లెమొగ్గలు దండలుగుచ్చి వెయ్యడమూ—అందులోనూ—శల్లికి. ఇంతకంటె పుణ్యం యేం వుందే ?"

"ఈ జన్మలో యింతయింది, యిక ముందుజన్మలో అనుభవించకపోతా నని బెంగ. ఏదో, చేతులారా ప్రాణాలు తీసేసుకోలేక బతకడం......కాకపోయినా ముందుజన్మలో మనిషినే అయి పుడతా నన్న మాటేమిటీ ?"

"నిజమే. ఇలాంటి బుద్ధు లుండేవాళ్ళకి మనిషిజన్మ యెలా వస్తుందీ ?"

"ఇంతకంటే పశువుజన్మో, పిట్టజన్మో వస్తే నయం. ఈ రాతా, యీ గోతా—"

"వెనకటిజన్మలో యెవళ్ళని చూసి యేడ్చావో ! ఎవళ్ళ సుఖం పాడుచేశావో ! ఎవళ్ళకి యెడబంధాలు కల్పించావో ! లేకపోతే నీకీ రాత యెందుకు వస్తుందీ ! ఇప్పుడేనా ముందు జన్మకోసం జాగ్రత్తపడవే అంటే—నీకోసమే కాని నాకోసమా యేమిటి ?"

"నీకోసం అని యెవ రన్నారూ ?......అన లెవరికోసం అయితే మాత్రం నాకు తప్పుతుందీ ? నువ్వు ప్రేమ వున్నదానవు కనక నీకూతురికోసం గంధం తియ్య మన్నావు. తప్పని యెవ రన్నారూ ? నాకా వూహ కలగలేదు ; కాని నేను మాత్రం తియ్య నన్నానా, తియ్యనా ? నువ్వు చెప్పావు కనక యిక యివాళ మొదలు యేరోజునేనా మరిచిపోతే అడుగు. తిని

కూచుని—కూచుంటే సాగుతుందా యేమిటి నాకు? రెక్కల్లో సత్తువ వుందికదా?”

“నోసి నీ మొగం యీడ్వా! శాస్త్ర మాట అనేటప్పటికి కింత దండకం విడిచేశావే!”

“.....................”

“తల్లికి చెయ్యడానికే యేడ్చేదానవు నువ్వు మరొకళ్ళ కేం చేస్తావే?”

“.....................”

“బాగా వున్న నారింగోజులా మొగం మాడ్చుకునో యేడుస్తూనో యెలాగయితేం కాస్త గంధం తీశావే! స్నానానికి కనీసం నీళ్ళు కాచేవే!......ఇంతేనా నువ్వు చేసింది? వేదం అంతా చదువుకున్న శాస్త్రాలు అతగాడికి చెయ్యడం దేవుడికి చెయ్యడం కాదుటే?”

“దేవుడికో మనిషికో చెప్పించల్లా—తో పంచల్లా—చేత నైనంతా చేశాను. నేనేమీ వొళ్ళు దాచుకోలేదు. దాచుకోను.”

“దాచుకుందా మంటే మాత్రం సాగనిస్తారా యేమిటి?”

“సాగనిస్తున్నారా యేమిటి? సాగనివ్వ మని మాత్రం నేనడ్గానా యేమిటి? దొడ్లో గేదె వుంది, యింట్లో నేనూ వున్నాను. ఇంటిల్లపాదికీ—”

“నోసి నీసిగ్గు చిమడా! కనిపెంచే గేదెకీ నీకూ సాపత్యంటే?”

“.....................”

“కనా లని— యెంత వూహ వుందే దిక్కుమాలిన దానగా!......మీ నాన్నతో చెబుతా నుండు”

“.....................”

“దరిద్రం వోసుకుంటూ పుట్టావు. నీకంత యోగం యెలా పడుతుందీ?”

“.....................”

“నువ్వే దుర్ముహూర్తాన కడుపున పడ్డావో కాని అప్పుడు చచ్చిబతికింది మా అమ్మ. నువ్వు చేట్లో పడ్డావు, మీనాన్న వుద్యోగం పోయింది”

“నాకు పుస్తె కట్టాడు, ఆపిల్లాడు చచ్చాడు. ఏం, ఈమాటకూడా అన్నావుకాదేం?”

“ఇంకా అనలేదే మని దెప్పడం కూడానా? నిజంగా నిన్నే పెళ్ళాడకపోతే బతికే వుండు నా వెర్రిబాగుల నాయన. పదిహేనేళ్ళకీ మిటికెక్కలేదను— అతనెంత గొప్ప వుద్యోగస్థుడయిపోవునో నీకేం తెలుసూ?... పైగా చచ్చాడు, చచ్చాడని యీసడింపుకూడానా?”

“.....................”

“నీకు పుస్తెకట్టడమే అతని కొంప తీసింది”

“.....................”

“నువ్వు కాలుపెట్టావు, వాళ్ళ కొంపకు—ఆతల్లి కడుపు కాలిపోయింది”

“.....................”

“నిజంగా చచ్చి సుఖపడ్డాడా అబ్బాయి. అతను బతికే వుంటే నువ్వు కాపరం చేస్తావా?......కాపరమే చేస్తే అతనికి అన్నం పెడుదువా?......అన్నం పెడితే నిద్రపోనిస్తువా?......నిద్ర పోనిస్తే—”

“నిద్రపోనిస్తే పీక పిసికి చంపెయ్యకపోదువా?”

“నువ్వు అంతపని చేసేదానవుమాత్రం అవుదువు. విన్నావా?......నువ్వెంత కైనా సాహసురాలవు”

“.....................”

“చేసుకున్న వాణ్ణి— చచ్చినవర్గాన్నున్న మొగుణ్ణి యింత లేనిమాటలు—”

“నన్ను చేసుకున్నాడు కదా, మరి ఆపిల్లాడికి స్వర్గం వస్తుందా?”

“అదీ నిజమే. అదీ నిజమేనే!......ఎంత జాణవైనావూ!......కొంప చెడపుట్టి—చివరికి మనువర్తికి కూడా గతి లేకుండా—”

“చాకిరీకోనం పుట్టాను. ఇక మనువర్తి యెందుకూ నాకూ? చేయించుకున్న వాళ్లు గంజి పొయ్యకపోతారా’

“కనక చెయ్యి......నన్నెదిరిస్తావా? ఎదిరిస్తావా అంటే?......నన్నెదిరించి నువ్వు బతికి బట్టకడతావుటే?’

“ఆవుపాయం మాత్రం కాస్త తొరగా చూడు, చాలా పుణ్యం వస్తుంది నీకు”

"ఏమన్నావూ ?......ఏంపేలుతున్నావూ ? నేనేం మందులు పెడతానా మాకులు పెడతానా ? ఎంతలేసి మాట లంటున్నావే చలితేలులాగా ?"

"......................"

"నేలబెట్టి రాసేస్తాను కాని నిన్ను చావనిస్తానా నేనూ ?......చూస్తూ వుండు"

"......................"

"ముందు నేను కాస్త నిద్రపోయిలేచాటప్పటికి కంచులు బాగుచెయ్యకపో, మహామ్మాయి వండించేస్తాను నిన్ను"

౨

"ఏమే, చెల్లీ ? ఒక్కపని చెబుతాను చేసిపెట్టవూ?"

"అడగడం యెందుకూ ?"

"చేస్తా నను"

"చెయ్యక యేంచేస్తానూ ?"

"......ఈగుడ్డ రైక కుట్టిపెట్టాలి"

"......అలాగే"

"దీపాలుపెట్టాటప్పటికి—తెలిసిందా ?"

"ఇవాళ కాదు. రేపుసాయంత్రానికి కుట్టియిస్తాను"

"ఇవాళేం చేస్తావమ్మా ?"

"పెద్దక్క, కూతురికి జాబ్బా కుట్టమని యిందాకానే యిచ్చింది గుడ్డ. పని తెములగానే అది ముందు చెయ్యాలి"

"పోనీలే........"

"ఏం, వుళాక్కుంటావేం ?"

"......................"

"నేను కుట్టననలేదు. ఆపైని నీయిష్టం"

"నోటితో వేరే అనాలా యేమిటి ? పైగా, నీ యిష్టం కాని నాయిష్టమూ యేమిటి? నాయిష్టమయితే రేపుసాయంత్రందాకా యెందుకు వాయిదా వేస్తావూ!"

"ముందు వుచ్చుకున్నది వెనక్కి పెడితే అదే మంటుందో యేమైనా ఆలోచించావా ?"

"కొడుతుందా యేమిటి !"

"......................"

"దాని కూతురికి లగ్గం మించిపోతుందా యేమిటి?"

"......................"

"అసలు పెద్దదంటే నీకభిమానం. స్పష్టంగా అలా చెప్పెయ్యక మునుగులో గుద్దులాట యెందుకూ?"

"దుడుగూదుడుగూ మాట లనెయ్యడ మేనా నాసంగతి చూడ్డం వుందా?"

"నీసంగతి కేమమ్మా? వండాలా వార్చాలా?"

"అదే నయం. మడికట్టుకుంటే చాలా పనులు తప్పించుకోవచ్చు"

"ఇప్పుడయితే మాత్రం యీరకసిన్ని కంచులూ బాగుచెయ్యక మేనా?"

"ఇప్పు డెన్ని గంట లయిందో యెరుగుదువా?"

"రెండే కాదూ? మూడు కొట్టాటప్పటికి యీపని అయిపోతుంది"

"వొక్క గంటలోనా?"

"పోనీ, నాలుగింటికి. ఏం? తరవాత యేం చేస్తావమ్మా?"

"గంధం యెవరు తీస్తారూ?"

"ఎవరికి?"

"అమ్మక, నాన్నకీ—"

"అమ్మ తియ్యమందా."

"అమ్మమ్మ పురమాయించింది. అసలు యెవరూ చెప్పకుండానే నేను వూహించుకోవలసిందిట"

"పోనీ, అరగంటలో అదయిపోతుంది. తరవాతో?"

"అప్పటికి మరో కొత్తపని తగలకపోతే అక్క కూతురు జాబ్బా—"

"ఎంత చెప్పినా చివరి కదే మాట. ఇవాళో రేపో వస్తారు మీబావ. రెండునెలల కిందట వచ్చినప్పుడు తెచ్చి యిచ్చారిది. మళ్లీ వచ్చాటప్పటికేనా—"

"ఇన్నాళ్లూ చెప్పావుకాదేం?"

"ఇప్పుడు జ్ఞాపకం వచ్చింది. కాకపోయినా గంట పని. నువ్వు తలుచుకుంటే అరగంటలోనే అయిపోతుంది......కుట్టిపెట్టవే! ఏమే చెల్లీ?"

"అక్కడికి కోసం రాకుండా చూస్తావా మరి!"

"......నీయిష్టం వచ్చినట్టు తిరుగుడు. ఇంచేతే నిన్ను చూస్తే నాకు వొళ్లు మండిపోతుంది. నేనే పని చెప్పినా యింతే నవ్వు. పెద్దదంటే మాత్రం పడి చచ్చిపోతావు. అదీ నవ్వు కిట్టకట్టకు గోదావరిలో దిగండి. కాస్త రైక భాగ్యానికి—నేను కట్టకోలే నను కున్నావు కాబోలు పరం! నన్నే మాత్రం సాయం చెయ్యిపోతావా అని అడక్కుండకి—పోనీ లేవు సాయంత్రానికి తప్పకుండా యిస్తావా!"

"ఇస్తాను"

"మూడు వంతులు లేవు పొద్దున్నే కట్టెయ్యి. ఏం!"

"అలాగే చూస్తాను"

"చూస్తా నేమిటి, చేస్తా నను"

"అంటే చేసి, అనకపోతే చెయ్యక మానానా!

"సడే. ఏం సంగనాచివే మామ్మా!"

"......................"

"ఎంతజలి మారినా సరే అనే అంటావు కాని—లేవు సాయంత్రానికి తప్పకుండా యిస్తావుకదా!"

"ఇస్తాను"

"..........మరిచిపోకనువూ. అసలు భోజనాలు కాగానే నేను వచ్చి నీదగ్గిరే పడుకుంటాను. రాత్రి మాలిన యెండలు ముదరడంవల్ల తిండితినగానే కునుకు నిద్రపోతేగాని—మళ్లీ లేచాటప్పటికి కొట్టేస్తావు. కాదూ!"

"......................"

"మీ బాబు యెంతో మెచ్చుకుంటారు నిన్ను. నాకి వుద్యోగం అయినాక నువ్వు వచ్చి నాదగ్గిర వుందువు కాని. ఏమే! వుంటావా!"

"ఎక్కడా వుండకపోతే రోజు లెలా వెడతాయి నాకూ!"

"ఎంతమాటన్నావే మాకల్లీ! నువ్వు రాకపోతే నేను వొండుకోలే నను కున్నావా యేమిటే! అసలు వంట లక్కనే పెట్టేసుకుంటాం మేము. వాకల్ల అవసరమే లేదూ మాకు"

"......................"

"లేవు కట్టకపోతే అమ్మమ్మతో చెబుతా నేమను కున్నావో మరి! నాకేం!"

"......................"

3

"జబ్బా రేపు వుట్టు కయింది—ఇంకెందుకే గంధం!"

"అమ్మకి నాన్నకీనీ"

"......................"

"......................"

"సగ మేనా కట్టావా పోనీ!"

"కత్తిరింపు లయినాయి"

"సెబాసు. వొంటిగంట కిస్తే యిప్పటికి కత్తిరింపులా అయినాయి!"

"నువ్వలా వెళ్లగానే నాలుగుకుంచాల పిండుల తట్ట వచ్చి నానెత్తిమీద కూచుంది"

"......................"

"ఇప్పుడే నా దగ్గిర కూచున్నాను. ఒక్క అరగంటకి యిది పూర్తిచేసేసి బుల్లెమ్మ చొక్కా పని చేస్తాను"

"చిన్నక్క యేమిటీ యిచ్చింది!"

"దానికి రైక కుట్టిపెట్టాలిట"

"దాని కూడా చింపు లయినాయి. కదూ! నాకు తెలుసు. అదంటే నీకభిమానం యెక్కువ. నేను యిచ్చిన పని మానేసి—సగం సగం చేసి అది మొదలు పెట్టావు. అవునా!"

"చెప్పేది వినిపించుకోకుండా—"

"అక్కర్లేదు, తెలవడం లేదా యేమిటి! ఎన్నోమాట్లు చూశాను నీగుణం. నువ్వెప్పుడూ దానికోసం దొల్లిపోతావు. నాకంటే అదేమీ నీకు వొరగబెట్టలేదు"

"......................"

"చంటిపిల్ల యెక్కువో తాడిచెట్టులాగ కాపరం చేసేది యెక్కువో కనిపెట్టకపోయావు నువ్వు"

"......................"

"తండ్రి తెచ్చిన గుడ్డ పింతల్లివి, నువ్వు కుట్టిపెడతా వని— చూడవే—చూడవే నీకేసి యెంత ఆశగా చూ స్తోందోనూ!"

"దిక్కుమాలిన పిన్ని—చచ్చిపోయిన పిన్ని—నా కేసి చూస్తే యేం వుంది తిల్లీ!......మాఅమ్మ! మా తల్లే! జాబ్బా కుట్టిపెడతా నమ్మా! రాత్రి తిండి మానే కానా కుట్టిపెడతాను. తప్పకుండా కుట్టిపెడతాను"

"చేతీసిన వాళ్లని పట్టుకు పాకులాడతారు చంటి పిల్లలు. నీకు తెలిసింది కాదుగాని నాపిల్ల నీపిల్లే అను కుంటే యెంత బాగుండునూ! ఇలా అయిపోయిన వాళ్లు లోకంలో అక్కల పిల్లల్ని పెంచి యెంతమంది సుఖప డ్డా లేదూ?"

"..... ................"

"చిన్నక్కలాగ మాయమాటలు చెప్పడం నాకు రాదు. నువ్వంటే నేనెంత అభిమానపడిచస్తానో— యెందుకూ చెప్పుకోడం? నువ్వు నాతో వచ్చావంటే నిముషంలో మా ఆడబడుచుని లేవగొట్టెయ్యనూ? నా యిల్లంతా నీస్వాధీనం చేసెయ్యనూ?"

"..... .............."

"నువ్వు చేసే చాకిరీ చూస్తే—నువ్వు పిల్లని మానుకుంటూ వుంటే చాలు, వొక్క పని చెబుతానా నేనూ?"

"....................."

"ఇంచక్క, మాధవస్వామిగుడి మాయింటి కింతో దగ్గిర. రోజూ వెళ్లి—నీకంతకంటే యేంకావాలీ? గు ప్పెడన్నం—చారెడు బట్ట—నీకు లోటు చేస్తానా నేను? అసలు తాళాలు నీచేతికే యిచ్చేస్తారు మీబావ. నెల్లా ళ్లు తిరిగా రంటే దోసెడేసి రూపాయలు—నోములు, వ్రతాలు, కాశీరామేశ్వరాలు—నీకడ్డేమిటి నాయింటోను?"

"............................."

"చిన్నక్క నిన్ను తీసుకువెడుతుం దని వుబలాట పడుతున్నావు కాబోలు. దానిమొగుడు—అలాంటి చోట నువ్వుండకూడదు"



"..............................."

"నువ్వేనా వూహా తెలిసిన దానవు కాని చిన్నపిల్ల వు కావు. బాగా ఆలోచించుకో"

"..............................."

"నేనొక్కమాటు వాళ్ల సుందరమ్మగారి యింటికి వెళ్లివస్తాను, యిదయిపోగానే జాబ్బా కుడుతావు కాదూ"

"అలాగే"

"ఈమాటలు చిన్నక్కతో అనేవు సుమా! వొట్టి కజ్జాకోరు పీనుగు అది...నన్నేం చెయ్యగలదు గానీ— అయినా యెందుకూ?"

"అలాగే"

"మరి వెళ్లి రానా?"

"ఊ"

"మాసం వచ్చాటప్పటికి పిన్ని నీకు జాబ్బా కుట్టేస్తుంది. వెంటనే అది తొడిగేసుకుని—ఇవాళ రాత్రి దాని పక్కలో పడుకుంటువుగాని నువ్వు, ఏం తల్లీ?"

౪

"ఏంచేస్తున్నావు రుక్కూ?"

"ఇప్పుడే గంధం యింటో పెట్టేసి, వచ్చి కూచున్నాను పెద్దక్క కూతురు జాబ్బా కుడదా మనీ"

"దాని కిప్పుడేం తొందరా?"

"ఎవళ్ల పని వాళ్ళకి తొందరే. ఇంకా పూర్తి కాలేదా అని తూరం కిందటే సాగదీసుకుని వెళ్లిందది"

"తేరగా చేసేవాళ్లుంటే సరి. తనేం చేస్తుందిట?"

"నేనడగ లేదు"

"అయితే అది యింటో పడేసి రా"

"ఎందుకూ?"

"కందులు వేయించాటప్పటికి అమ్మమ్మకి వొళ్లు మానం అయిపోయిందిట"

"ఊహూ"

"నన్ను మీ నాన్న తల అంట మంటున్నారు. నేనే కాని పనికిరాదట"

"ఊహూ"

"అమ్మమ్మ తనమ్మాయికి కాస్త వుప్పుపిండో, మినప రొట్టో చేసుకుంటే చేసుకుంటుంది, లేకపోతే మానేస్తుం దిట"

"ఊఁహూఁ"

"నువ్వు వంటచెయ్యాలి"

"..............................".

"ఈపూటకే. రేపు నేనే మడికట్టుకుంటానులే"

"కందులు బాగుచేశాటప్పటికీ, గంధం తీశాటప్పటికీ నాకు చేక్కలు పడిపోయా యే"

"పాయసగ్గిన్నె కూడా వొద్దేమో కామా, రుబ్బాలా పోటు వెయ్యాలా ?"

"..............................."

"అరటికాయ వుప్పూగారం వేసి, చారు గాచు మరేమీ అక్కర్లేదు. మామిడికాయల పచ్చడి మాత్రం కాస్త రుబ్బు"

"..............................."

"పచ్చడి చద్దిఅన్నాల్లోకి వుండాలినుమా...మరి లే"

"పెద్దక్కనేనా, చిన్నక్కనేనా వండమనరాదు టే?"

"వాళ్లెందుకు చేస్తా రమ్మా మనకి ? ఇక్కడ మనం వని చెబితే వాళ్ల మొగు ళ్లేమంటారో ? అత్తగార్ల కేం కోపం వస్తుందో ?"

"..............................."

"వాళ్ళంతటవాళ్ళు చాళ్ళు. మనకి వోపిక వుంటే పెట్టాలి, లేకపోతే పంపెయ్యాలి; గాని పని చెప్పకూడదు"

"..............................."

"వాళ్లకి తోచి చేస్తే—ఇంకెందుకూ! అప్పుడే ఆర యింది. మీనాన్న పెండలాడే వంట కావా లంటు న్నారు. లే. కూచోకు. ఆగుడ్డ అవతల పడేసెయ్యి"

"..............................."

"ఆలోచిస్తూ కూచుంటే కాదు. ఇదిగో నేను వెళు తున్నాను మరి. పచ్చడి రుబ్బలేకపోతే చారు మానేసి, మునక్కాడా పననపెచ్చూ, వంకాయా వేసి పులుసు చేసినా సరే. లేకపోతే అమ్మమ్మ యేం చెయ్యమంటే అది చెయ్యి"

"......ఇస్, రామయ్య తండ్రీ !"

౫

"ఏయ్ ! ఎవరు వంటింటో ?"

"నేను రా తమ్ముడూ ! ఎందుకూ ?

"నిమిషాలమీద అన్నం పెట్టెయ్యాలి నాకు"

"..............................."

"మాట్లాడవేం ? సినిమాకి వేళ అయిపోతోంది తొర గా వడ్డించు. కంచం పెట్టకోనా ఆకు వేస్తావా ?"

"ఇం కా యెసట్లో బియ్యం పొయ్యాలేదురా"

"ఇంతసేపటి దాకా యేం చేస్తున్నావు మరి ? వెధ వది ఎండో ఆటకి వెళితే రేపు చదువు తగులడిపోతుంది. ఇప్పుడేనా బియ్యం పోసెయ్యి"

"ఇంకా యెసరు కాగందే ?"

"నీ మొహం లాగే వుంది వంట. మరి యె—— యేడవడం ?"

"పాడిఅన్నం తింటావా ?"

"ఏడిసినట్టుంది నీమాట......మరి అదే తగలెయ్యి"

"చిన్నక్క నేనా పెద్దక్కనేనా పెట్టమను"

"చిన్నక్క మల్లెమొగ్గలు దండగుచ్చుకుంటోంది. పెద్దక్క పిల్లకి పాలు కలుపుకుంటోంది. నువ్వే పెట్టాలి"

"నేను ముట్టుకోగూడదు"

"అయితే తగులకు వెధవ ఆచారమూ నువ్వూనూ"

"..............................."

"లేకపోతే పదిగంటలదాకా చచ్చినట్టు మేలుకుని వుండు మళ్ళీ వచ్చి తింటాను"

"..............................."

౬

"ఇవాళ నువ్వు మడికట్టు న్నా వేమమ్మా ?"

"అమ్మ చెప్పింది కట్టుకోమనీ"

"పెద్దక్క యేం చేస్తోందీ ?"

"ఏమో ?"

"చిన్నక్కో ?"

"ఏమో ?"

"అమ్మమ్మో ?"

"......నాలుగు కుంచాల కందులు వేయించాటప్పటికి నానడుం పడిపోయింది. నేనింకా యెక్కడ వండి వడ్డించగలనోయ్యీ?"

"సరే అయితే; ఆసంగతి నాకేం తెలుసూ?"

"ఇదే కాదు, ఇంటి సంగతి యేమీ తెలవడం లేదు నీకు. భోజనం చేస్తావు. వూళ్లోకి వెళ్ళి తిరిగితిరిగి మళ్ళీ వంట అయ్యేటప్పటికి వస్తావు. లేకపోతే ముసుగుతన్ని—చెయ్యలేక నేను చచ్చిపోతున్నాను బాబూ"

"మీ అమ్మాయి యేం చేస్తోందీ?"

"అది వూరికే కూచుంటోం దనా నీవూహ?"

"............................"

"వంటలోకి రావన్న మాట గాని పైనపనంతా యెవరు చేస్తున్నారో యెరుగుదువా?"

"............................"

"ఇంతకీ: నాశక్తి సన్నగిల్లిపోయింది. నారెక్కలు మూలపడ్డాయి. మునపటిలాగ నేనిక చెయ్యలేను. దీనికి నువ్వేదేనా వుపాయం చూడాలి"

"ఔషధం యేదేనా పుచ్చుకోరాదూ?"

"కాటికి కాళ్లు చాచుకూర్చున్నదానికి ఔషధాలేమిటోయ్?"

"ఇంటిపని మాట దేవు డెరుగును; మీరు సుఖంగా తిని కూచోడాని కేనా—"

"పని చెయ్యలేను కాని నాకేం తెగులా రోగమా? ......పైపని కేమీ బాధ లేదు, వంటదగ్గరే వస్తోంది యిబ్బంది"

"మీ అమ్మాయి వంటలోకే రారాదూ, పైపని కుక్కమ్మ చేస్తుందీ?"

"చెప్పాను కాదూ? పైపనులు తెముల్చుకోడంమాత్రం మాటలా? కాకపోయినా తలచెడ్డవాళ్లిద్దరింటో వుండగా పునిస్త్రీవడుచు మడికట్టుకోడం యేమిటోయ్?"

"............................"

"పైగా పదిరోజులనుంచి దానికి అన్నహితవు లేదు కూడానూ?"

"అయితే మధ్యమధ్య వండిపెడ్తూవుండండి రుక్కమ్మ చేత, రోజూ మాత్రం వద్దు"

"అదెలాగా తప్పదూ. అయితే నామాటా?"

"అంటే?"

"అది చేసిన వంట నేను తింటానుటోయ్? నీకింత తెలవకుండా వుందేమిటీ?"

"............................"

"నేను పోయినక్కర పని కొట్టుకోడం యేలాగా తప్పనప్పుడిక అది కూడా మడికట్టిన అందం యేమిటి, లాభం యేమిటి?"

"అయితే యేం చెయ్య మంటావూ?"

"నానోటితో చెప్పాలా?"

"............................"

"నీకు ఆలోచన తోచే లేదంటావా నిజంగా?"

"మీరు చెబితే యేమీ?"

"అయితే—దాని బతుకంతా తెల్లారిపోయింది. ఇంకేమున్నా లేనట్టే"

"కనక?"

"ఎప్పుడో వొకప్పుడెలాగా తప్పదూ. రోజులు గడపడం తప్ప లాభం యెలాగా లేదూ"

"అయితే?......ఏమిటి చివరికి?"

"తల అంటుకోనా, దువ్వుకోనా, జడ వేసుకోనా, యింకెందుకోయ్ దానికి దిక్కుమాలిన జుట్టూ?"

"............................"

"అదేమమ్మా పుటుకు కింద పోసేస్తున్నావూ?"

"గరిటె వేడిగా వుండడంవల్ల చెయ్యి వొణుకుతోంది నాన్నగారూ"

"............................"

"ఇందాకా రామదీక్షితులుగారి నడగ్గా యెల్లుండి దశమినాడు మంచి దన్నారు. కోటిలింగాలకి వెడితే వొక్క నిమిషం పని"

"............................"

"నువ్వు శాస్త్రదూరం ఆలోచిస్తే కాని వీలు లేదు. మొగుడు చచ్చిన పసుపుపిల్లలికి మంచిరోజులు కావివి. మొన్ననే వీరేశలింగం తోటలో వొక విధవ పెళ్ళి

అయింది. ఇంకా నలుగురు విద్యార్థినులకోసం వెధవ ముండల్ని వెతుకుతున్నారుట. వాళ్ళ ముహూర్తం లేకుండా, వాళ్ళ సమయాసమయాలు చూడకుండా యే క్షణంలో పడితే ఆ క్షణంలో చేసేస్తున్నారుట పెళ్ళిళ్లు. తరవాత యేమనుకున్నా యిక కలిసిరాదు సుమా"

"పదిహేడేళ్ళు నిండలేదుకదా—"

"ఎన్నేళ్లు నిండితే యేం వొరిగిందీ?......పదిహేడేళ్ళు నిండకపోయినా కనకనే పాడుబుద్ధులేమీ పుట్టకుండా జాగ్రత్తపడాలి మనం"

"..............................."

"నువ్వేమో పిల్లని దయతలుస్తూ వున్నట్టనుకుంటున్నట్టున్నావు. ఇది కొరివితో తలగోక్కోవడం కాని మరోటి కాదు"

"మీ అమ్మాయి యేమంటుందీ?"

"ఎంత అవసరం వచ్చినా తల్లిపిల్లకు నోరారా చెప్పకూడదా!"

"నేను మాత్రం—"

"నువ్వే చేయించాలి. నీకేం మొగాడవు......కాక పోయినా మీకెవరికీ బాధ లేకుండా నేను చేయించేస్తాను తెల్లవారేటప్పటికి"

"..............................."

"అదేమమ్మా నీళ్ళలా వొలకపోశావూ?"

"నేతిజిడ్డుమూలాన చేతిలోనుంచి చెంబు జారిపోయింది నాన్నగారూ"

"..............................."

"చూశావా?......ఇదీ వరస. ఒక్క పని చేత కాదు. చేసినంతమట్టుకేనా వొబ్బిడీ, నిదానమూ యేమీ లేదు......తిని కూచున్నట్టే వుంటుందా వండి వడ్డించడం అంటేనూ?"

"..............................."

"నీకిదే చెప్పడం. దశమీ బుధవారం తప్పదు... వినపడిందా?"

"చెవుల్లో హోరు పుట్టుకువస్తూంటే వినపడకపోవడం యేమిటండీ?"

"..............................."

౭

రుక్కమ్మ, వంటింటికి గొళ్ళెంపెట్టి తన పక్క మీదకి వచ్చేటప్పటికి పదకొండున్నర అయింది.

అప్పటికప్పుడే యింటిల్లిపాదీ గాఢనిద్రలోవున్నారు. మునలమ్మ వసారాలో పడుకుని పాపుకుపిల్లులతో కొట్లాడుతూ వుంది.

అక్కడికి తానెలా వచ్చిందీ రుక్కమ్మ యెరగదు. వచ్చీరావడంతోటే కాళ్లు తేలిపోగా ఆమె మంచం మీద వెల్లకిలా పడిపోయింది.

దీపం బాగా స్ఫుటంగానే వెలుగుతోంది; కాని ఆమెకి అంతా అంధకారబంధురంగా వుంది. పైగా దెయ్యాలూ, భూతాలూ వచ్చి తన శరీరం కండలు కండలుగా పీకేస్తూ రక్తం పీల్చేస్తూవున్నట్టుంది.

ఇలాగ అయిదునిమిషాలయినాక ఆమె కొంచెం తెప్పిరిల్లింది; కాని మనస్సు మాత్రం నేలమీద పడ్డ పాదరసంలాగ చెదిరిపోతూనే వుంది.

ఆమెకి, అన లేమీ తోచడమే లేదు. తోచినా బోధకావడంలేదు. అయినా నిలవడం లేదు. నిలిస్తే మళ్లీ అంతట్లో అంతా అయోమయమూ, అడివీ, ముళ్లూ అయిపోతోంది.

కష్టంమీద ఆమె నాలుగు నిమిషాలు కళ్లు మూసుకుంది; కాని యిక ఆగలేకపోయింది. కళ్లు తెరిచేటప్పటికి రైకగుడ్డ చేకపుచ్చుకుని కొరకొర చూస్తూ చిన్నక్క వాళ్ళ వేపునా, జుట్టుగుడ్డ పట్టుకుని పళ్లు కొరుకుతూ పెద్దక్క వాళ్ళ వేపునా, పీటమీద కూచుని విస్తరి తుడుచుకుంటూ వురుముతూ చూస్తూ తమ్ముడు వాళ్ళ వేపునా, కత్తి నూరుతూ మంగలి కూడా రాగా స్వయంగా కత్తెర పుచ్చుకుని అమ్మమ్మ వాళ్ళ వేపునా, రెక్కలు పడిపోయేలాగ తాను తీసిన గంధం అంతా వుడుకులాం కలిపి పూసుకుని, బుగ్గాబుగ్గా ఆనించుకుని సుఖంగా—తల్లీతండ్రీ వాళ్ళ వేపునా—రుక్కమ్మకి వొళ్లు తెలవలేదు. మనస్సు గుబగుబలాడిపోయింది. నరాలు పొంగిపోయాయి.

ఇక ఆమె పడుకోలేక గభీమని కూచుని, కూచున్న పాళంగా లేచి నుంచుని, నంచోడం తడువుగా వాకిట్లోకి వచ్చి, వచ్చిన వెంటనే వీధితలుపు తెరిచి, తెరిచిన వెంటనే వీధిలో—అంధకారంలో—సుడిగాలిలో పడి దిక్కు తెలవకుండా బయలు దేరింది.

ఇలాగ, ఆమె, తానెక్కడికి వెడుతూ వున్నదీ, యెక్కడికి వెళ్లవలసిందీ తెలవకుండా—ఆవిషయమే స్మరించుకోకుండా నడుస్తోందా, పరిగెడుతోందా అన్నంత వడిగా వెడుతూ వుండగా వోక గోడవార బండిలో పడుకుని చుట్ట కాలుస్తూవున్న బండివాడు పలకరించాడు.

"బండి కావాలా?"

"............................"

"మేఘాలమీద యెగిరిపోతేనే డబ్బివ్వండి"

"............................"

"అర్ధరాత్రివేళ కుక్కలో నక్కలో, తేళ్లో పాములో—అర్ధలా, రూపాయలా, పావలాడబ్బు లివ్వండి"

"ఏ పేట నీది?

"దానవాయిగుంట"

"ఏం పుచ్చుకుంటావూ?"

"పంతులుగారి తోటకా?"

ఇలా అడుగుతూ బండివాడు యెదటికి వచ్చి "బండెక్కం డమ్మాయిగారూ! నిమిషాలమీద తోలుకుపోతాను" అన్నాడు.

"నాదగ్గిర డబ్బు లేదూ లేవు"

"పంతులుగారి తోట కయితే నాకేమీ యివ్వనక్కరలేదండి"

ఇలా చెబుతూ వాడు గుర్రాన్ని పూన్చి బండి వది వీధిలోకి తీసుకురాగా ఆమె మాట్లాడకుండా యెక్కి కూచుంది.

గొరడా ఛెళ్లు మంది.

"నాకూ తెలుసునం డమ్మాయిగారూ కష్టసుఖాలు. నాకు వొక్కత్తే కూతురండి. అది యీడేరకుండానే మొన్న మొన్ననే దాని మొగుడు చచ్చిపోయాడండి. దాన్ని చూసినా, తలుపుకి వచ్చినా నాకు కడుపు చెరువయిపోతూ వుంటుందండి.....పంతులుగారి తోటలో మొన్న రెండు పెళ్లిళ్లయినాయండి. నిన్న యింకోటయిందండి. మరోకటి కూడా అయిపోయాదే కానండి నగం దారిలో తండ్రీ అన్నలూ నాబండే అటకాయించి ఆ అమ్మాయిగారిని తీసుకపోయా రండి. మరో పిల్లకోసం వెతుకుతున్నా రండి తోటలోవారు. మహా బాగుంటా రండి రాచకోమారుడు లాగ ఆ అబ్బాయిగారు. నెలకి యిన్నూరైరూపాయల జీతమంటండి. అక్కడ దిగగానే మీకు పెళ్లి చేసేస్తారండి. బాగా పుణ్యం చేసుకున్నా రండి మీరు. భయపడకం డమ్మాయిగారూ! ఇక మీ కష్టాలు—"

నిజంగానే, జట్కా, మేఘాలమీదే యెగిరిపోవడం వల్ల యీ కసిన్ని మాటలే వినిపించాయి.

## ప్రబుద్ధాంధ్ర అయిదో సంపుటం

అయిదో సంపుటం బావతు విడిసంచికలు పన్నెండూ రఫ్ కాగితాలవి అమ్మకానికి సిద్ధంగా వున్నాయి. వెల ఒక రూపాయి. పోష్టుఖర్చులు కలిపి మొత్తం ౧-౪-౦ ముందు పంపేవారికి వెంటనే పంపుతాము. వీ. పీ. చెయ్యము. ౧౦ సెట్టులే వున్నాయి. ఇదే సంపుటం గ్లేజుప్రతి బయండింగులో వుంది. అర్ధ కాలికో బయండు చేయబడుతోంది. వెల పోస్టేజీతో ౨-౧౨-౦.

కలాభివర్ధనీ పరిషత్తు—రాజమండ్రి

## పూలదండ—ప్రేమపాశం

శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారి చిన్నకథలు పూలదండ అనే పేరితో సంపుటాలుగా ముద్రించబడుతున్నాయి. మొదటి సంపుటం అచ్చులో వుంది. వెల ౦-౧౨-౦. శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారి ప్రేమపాశం అనే నాటకమున్ను అచ్చులో వుంది. వెల ౦-౧౨-౦. ముందుగా ౧-౮-౦ పంపేవారికి యీ రెండూ అచ్చుకాగానే పోస్టేజీ మేమే భరించి పంపుతాము.

కలాభివర్ధనీ పరిషత్తు—రాజమండ్రి